# రజతోత్సవ వేడుకలో విజయవాడ

విజయవాడ!



ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత చాలాకాలం రాష్ట్ర రాజకీయాలను శాసించిన నగరం. చైతన్యానికి మారు పేరుగా నిలిచిన ఈ నగరానికి ప్రత్యేక విశిష్టత అంటూ ఏమీలేదు. కనీసం జిల్లా కేంద్రమైనా కాదు. అయినా జిల్లా కేంద్రం కంటే ఎక్కువ. జిల్లా కేంద్రం కాకపోయినా జిల్లాకు కీలకమైన నగరంగా మారినవి రాష్ట్రంలో మూడే నగరాలు. అవి తిరుపతి, రాజమండ్రి, విజయవాడ.

తిరుపతి సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం కాబట్టి ఆ స్థాయికి ఎదగగలిగింది. రాజమండ్రికి రాజమహేంద్రవరంగా చరిత్రలో స్థానం ఉంది. ఆ కాలం నుంచే ఒక రాజధానిగా వెలుగొందిన నగరమది.

మరి విజయవాడ!?

చెప్పుకోవడానికి ఏమీ లేకపోయినా విశిష్ట నగరంగా ఎదిగింది.

నేడు రజతోత్సవాలకు ముస్తాబైన ఈ నగరం గురించి చిన్న వ్యాసం!

ఇంద్రకీలాద్రి చెంతన వెలసిన నగరం విజయవాడ! ఒకప్పుడు బెజవాడ అని పేరు. ఎండాకాలంలో మండించే ఎండలకు పేరున్న ఈ నగరాన్ని కవులు బ్లేజ్ వాడగా పిలుచుకునేవారు. చరిత్రలో విజయవాటికగా ఈ నగరాన్ని పిలిచేవారని చెబుతారు. ఇంద్రకీలాద్రిపై వెలసిన వెలసిన కనకదుర్గమ్మ పూర్వం ఈ నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించే మాధవవర్మ అనే రాజు నిష్పాక్షికతకు మెచ్చుకుని నగరమంతటా కనకవర్షం కురిపించిందని అప్పటి నుంచి ఇంద్రకీలాద్రిపై వెలసిన దుర్గమ్మను కనకదుర్గ అని, ఈ నగరాన్ని విజయవాటిక అని పిలిచేవారని చరిత్రలో ఓ కథ! భారతంలో అర్జునుడికి శివుడు పాశుపతాస్త్రాన్ని ప్రసాదించింది ఈ కొండ మీదనేనని కథ కూడా ఉంది. అదంతా చరిత్ర.

కళ్ళ ముందు కనిపిస్తున్నదేమిటో, నగరం అభివృద్ధి చెందిన పరిణామక్రమమేమిటో తెలుసుకుందాం!

స్వాతంత్రం వచ్చిన తర్వాత కోస్తాలో చైతన్యం, సిరిసంపదలు కలిగిన జిల్లాలుగా పేరు తెచ్చుకున్నవి కృష్ణా, గుంటూరు జిల్లాలు. కృష్ణా జిల్లాలోని విజయవాడ మెల్లగా వార్తా పత్రికల ప్రచురణ కేంద్రంగా మారింది. ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి వంటి పత్రికలకు ఇదే కేంద్రం. ఇప్పుడు కూడా పుస్తక ప్రచురణ కేంద్రంగా విజయవాడకే పేరు. పత్రికారంగానికి మద్రాసు తర్వాత అంతటి కేంద్రం కావడంతో రాష్ట్ర రాజకీయాలను శాసించే నిర్ణయాలకు విజయవాడ కేంద్ర బిందువుగా మారింది. ఆ పరిస్థితి చాలాకాలం కొనసాగింది.



విజయవాడ నగర అభ్యున్నతికి ఉపయోగపడిన మరొక అంశం. రైల్వే కూడలి కావడం!

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి ఉత్తరాంధ్ర జిల్లాలకు, తిరుపతి, నెల్లూరు తదితర ప్రాంతాలకు వెళ్ళడానికి మొదట్లో అందుబాటులో ఉన్న రైల్వేమార్గానికి విజయవాడ కూడలి కావడంతో క్రమంగా ఇక్కడ వ్యాపారపరంగా అభివృద్ధికి అవకాశం కలిగింది. వీటికి మించిన కారణం- సినీ పరిశ్రమ.

తొలినాళ్ళలో చిత్రపరిశ్రమకు మద్రాస్ తర్వాత అటువంటి కూడలిగా ఎదిగింది విజయవాడ. ఎన్.టి.ఆర్, ఎ.ఎన్.ఆర్ వంటి నటులు ఇదే జిల్లా వారయితే పొరుగున ఉన్న గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన సినీ రంగ ప్రముఖులు కూడా విజయవాడ నగరంతో సంబంధాలు ఏర్పరుచుకున్నారు. చిత్ర పంపిణీ సంస్థలకు కేంద్రంగా కూడా విజయవాడే అవడం, ఆటోమొబైల్ పరిశ్రమ వంటివి ఈ నగర అభివృద్ధికి బాటలు వేశాయి.

ఇదంతా ఒక ఎత్తయితే కనీసం మూడు నాలుగు జిల్లాల వ్యవసాయ రంగాన్ని ప్రభావితం చేయగల ప్రకాశం బ్యారేజ్ వల్ల సాగునీటి పరంగా నగర ప్రాధాన్యాన్ని పెంచింది. ఇప్పుడిప్పుడు ఈ అన్ని రంగాలలో పట్టు కోల్పోతున్నా, వ్యాపార కేంద్రంగా ఎదగడంతో ఆ లోటు కనపడడం లేదు.

ఇక చుట్టుపక్కల పల్లెటూళ్ళకు కూడలిగా మారడం మరొక కారణం.

ఈ కారణాల వల్లే విజయవాడ నగరం కార్పొరేషన్ స్థాయిని సాధించగలిగింది.

ఇదీ రజతోత్సవాలు చేసుకుంటున్న విజయవాడ నగర అభివృద్ధికి దోహదపడిన విషయాలు!